■ శాంతి నారాయణ

మీ సదువుకున్నోల్లు ఇంత అద్దుమానంగా ఉంటారని నేను కలలో గూడా అనుకోలేదు. సదువుకున్నోల్లు అందరూ ఇట్లనే ఉండారేమో నాకు తెల్దుగాని, నేను సూసినోల్లు మటుకు శానా పనికిమాలినోల్లే. ఈల్లల్లో మా బావ ఎంగటేసు మాత్రం రోంత సెడబుట్నాడు. అందికే ఆయనంటే మా అన్నదమ్ములందరికీ బొలే గవురవం.

ఇంతకూ సదువుకున్నోల్లమింద నింద మోపడానికి నేను మీరనుకున్నెంత పనికిమాలినోన్నేమీ కాదు. నాకూ అంతో ఇంతో యెవారం తెలుసు. సదువు బొత్తిగా రాక పోయినా, మీ మాదిరి తెల్లగా పుల్లగా సర్టూ ప్యాంటూ యేసుకోకపోయినా, మంచేదో చెడ్డేదో రోంత అర్తం చేసుకోగల్ను. మీ లెక్కన పరాయి తెలుగు బాసలో మాట్లాడేకి శాతగాక పోయినా నాకు తెల్సినదాన్ని తెల్సిన బాసలో చెప్పలోనంత శాతగానోన్ని కాదు.

సదువుకున్నోల్ల మింద నేను నింద మోపడానికి ఎనక సుమారగ కతుంది. ఆ కతంతా ఇంటే మీకే తెలుస్తాది, నేను వాల్ల మింద ఎందుకు నింద మోపుతాండానో, కతంతా ఇన్నెంక ఇది కతే గదా అని కొట్టిపారెయ్యొద్దండి. ఇనినోల్లందరూ రోంత గట్టిగా ఆలోసెన సెయ్యండి. తెల్సినోల్లూ పెద్దోల్లూ ఇంగిత గ్నానం ఉండే వాల్లూ సంగంలో జరుగుతా ఉండే అన్నాయాన్నీ, అదర్మాన్నీ పట్టించుకోకుంటే ఈ దేశం యాపక్క పోతాదో, యెట్లయితాదో రోంత మదించుకోండి.

నా పేరు సూరప్ప. నా పెండ్లాం పేరు పెద్దక్క. మా ఊరు పరసన్నయ్య పల్లి. అనంతపురం మా ఊరికి శానా దగ్గిరగా ఉంటాది. మా ఊరి పక్కనే అనంతపురం ఇంజినీరింగు కాలేజి. నాకు పెండ్లి అయ్యేనాటికి మా నాయనా, మా యమ్మా సచ్చిపోయినారు. మేము ఐదుగురు అన్నదమ్ములం. నేను మా నాయనకు కడగొట్టోన్ని. మా నాయన సచ్చిపోయ్యే నాటికే మా అన్నగారు కడగాల ఐయ్యిండిరి. అయితే, మా నాయన సంపాదిచ్చిన రొండెకరాల మడిని అందరమూ కలిసి పొత్తలగా సాగు చేసుకుంటా ఉంటిమి. ఆ బూమి మింద నాకు బొలే నెర్లుండేది.

మా నాయనా, మాయమ్మా సచ్చిపోయినంక అయిదారేండ్లకు మా అన్నగార్లు కూడా వొగరి తర్వాత వొగరు కాలం తీరి యెల్లవారి పోయినారు. మేము అన్నదమ్ములం ఐదుమందీ కలిసి మాట్లాడుకొని పుట్టించుకుండామేమో అన్నెట్ల మాకు తలాకు ఐదుమంది పిల్లలయినారు. మొత్తం మా అన్నదమ్ముల సంతానంలో మా సన్నన్నయకు మాత్రం కడాన ఆడపిల్ల పుట్టింది. ఆ పిల్లకు ఇప్పుడు పజ్జెనిమిదేండ్లు. మా నాయన వొంశెంలో ఆడపిల్ల అదొక్కటే అయినందువల్ల మా అన్నదమ్ముల కొడుకులందరికీ ఆ పిల్లంటే శానా ప్రానం. ఈ మద్దెనే వొగ యాడాది కిందట ఆ పిల్లను వొగ ఉద్దోగస్తునికిచ్చి అందరమూ కలిసి గనంగానే పెండ్లిజేసినాము.

మా అన్నదమ్ముల పిల్లలెవురికీ సదువులబ్బలేదు. ఎవురూ అయిదో తరగతి పైన సదువుకోలేదు. అందరూ కాయకష్టం చేసుకొని బతికే వాల్లేగానీ ఎవురూ నీడపాట్న, కాలిమింద కాలేసుకొని కుచ్చోని సుకంగా బతికే దానికి నోసుకోలేదు. అయినా, లోకాన్ని బట్టి ఇట్ల అంటా ఉండాను గానీ నా పిల్లలెవురూ సుకానికి నోసుకోలేదనే బాద మాత్రం నాకు లేదు. యాలంటే మా పిల్లోల్లూ సదువుకొని ఉద్యోగాల్లో చేరింటే ఈ పొద్దు వాల్లు గూడా మీ సదువుకున్నోల్ల మాదిరే తయారయిండే వాల్లు గదా! సదువుకొని ఉద్యోగాల్లో చేరి జనాన్ని మోసం చేసి బతికే దానికంటే ఈ బతుకు మేలు కాదా! గంపెడు పిల్లలను పుట్టించుకోవడం వల్ల నేనూ, నా పిల్లలూ రోంత ఇబ్బంది పడిన మాట వాస్తవమే గానీ మీ సదువుకున్నోల్ల మాదిరి ఇతర్లకు అన్నాయం మాత్రం చెయ్యలేదు. పరుల సొమ్ము కోసరం ఆశెపడలేదు.

ఇప్పుడు నా వొయిసు యాభై అయిదేండ్లు. ఈనాటికి గూడా నా చెమటను గుమ్మరించే బతుకు



చిత్రాలు: నర్సిం



తాండాను. నా పెండ్లాన్ని సాకుతాండాను. తనను నేను సాకుతాండానంటే మా 'బసెలి' వొప్పుకోదు. యాలంటే ఇప్పటికే మొగోని మాదిరి అది గూడా పని చేస్తానే ఉంది. నాలుగు రాల్లు తెస్తానే ఉంది. మా మాదిరే మా కొడుకుల్నీ తయారు చేసినాము. వాల్లందరికీ పెండ్లిండ్లు చేసినాము. ఇప్పుడు సన్నోడు తప్పా మిగతా నలుగురూ 'కడగాల' కాపురముండారు. ఎవురయినా పెండ్లయిన కొత్తలో పెద్దోల్ల దగ్గిర అనిగి మనిగి ఉంటే పడక సుకం యెట్ల అనుబగిస్తారు? అందికే మేమే వాల్లను కడగాల పెట్టినాము. ఎవుని కస్టం వాడు చేసుకుంటా అందరూ ఆయిగానే బతుకుతాండారు. దినామూ అనంతపురానికి బేల్దారి పనికి పోయి సాయింత్రానికల్లా తలా నూరూ నూటాయాభై తెచ్చుకుంటా ఉండారు. వొగయ్యను ఆశించకుండా పరుల పంచల చేరకుండా నాలుగురాల్లు యెనకేసుకుంటా ఉండారు. ఆదివారం రాగానే అందురూ పెండ్లాం పిల్లలతో మా ఇంటి కొస్తారు. వొగొగ వారం వొగొగరు 'సంజిరి' కర్చంతా పెట్టుకుంటారు. తల్లులూ పిల్లలూ సందకాడదంకా సంతోషంగా గడిపి ఎవురిండ్లకు వాల్లు యెల్లిపోతారు. ఎల్లిపోతానే మా యిద్దరికీ వానొచ్చి ఎలిసినట్లయితాది. ఆ సందకాడదంకా మనవండ్లూ మనవరాల్లూ చేసిన సందడినంతా మల్లా వొచ్చే ఆదివారం వరకూ నేనూ నా పెండ్లామూ నెమురేసుకుంటా ఉంటాం.

సదువుకున్నోల్లను గురించి చెప్తూతానని మొదులు పెట్టి నేను మా సంసారం కత చెప్పడం మీకు నచ్చకపోవచ్చు. కానీ, మా యట్లా సదువు రానోల్ల బతుకులెట్లాటివో సొబావాలెట్లాటివో, నడతలు యెట్లాటివో తెలిపితే గదా సదువొచ్చినోల్లకూ మాకూ తేడా యేందో మీ కర్తమయ్యేది!

సరే, మా కతను అట్ల పక్కన బెట్టి సదువుకున్నోల్లు చేసిండే నిర్వాకాన్ని గురించి రోంత చెప్తాను, ఇనండి.

మొన్న, పోయిన ఆదివారం పెద్దల పండగకని మా అన్నదమ్ముల పిల్లలూ, మా పిల్లలూ అందురూ మా ఇంటికొచ్చినారు. పెద్దలకు 'సాంబ్రాణి' యేసి, బోజనాలన్నీ ముగించుకొని ఇంటి ముందరుండే చెట్టుకింద అందరమూ కుచ్చొని సంతోసంగా అవీ యివీ మాట్లాడుకుంటా ఉండాం.

బయట ఎండ, అగ్గి కురుస్తా ఉంది. అట్లా ఎండలో మా సన్నన్నయ్య కూతురు సీతమ్మ చేతిలో ట్రంకుపెట్టి పెట్టుకొని బరువుగా కాల్లీడ్చుగుంటా వొచ్చి మా అందర్నీ చూసి కన్నీల్లు కారుస్తా కూలబడింది. ఆ పాపను చూస్తానే మ సంతోసమంతా గాలికి ఎగిరి పొయ్యింది. అందరమూ ఆ పాప సుట్టూ చుట్టుకొని యేం జరిగిందని గుచ్చిగుచ్చి అడిగినాం. సీతమ్మ నా వొడిలో తలకాయి పెట్టి బోరున యేడ్చుకుంటా జరిగిందంతా చెప్పింది. నా తలకాయ తిరిగినట్లయింది. ఆడోల్లందరూ కంట తడిబెట్టి శానా బాద పడినారు. మగ పిల్ల నాయాల్లందురూ పటపటమని పండ్లు కొరికినారు.

మా వొంశెంలో ఆడపిల్ల సీతమ్మ వొగతేనని ఆ పాపను వొగ ఉద్యోగస్తునికిస్తే సుకపడుతాదని బత్తలపల్లి సంబందం ఖాయం చేసుకొని తలాకొగ చెయ్యేసి యాభైవేలు వరకట్నమిచ్చి, పది తులాలు బంగారు పెట్టి నిరుడు ఇట్లాటప్పుడు పెండ్లి జేస్తిమి. పిల్లను బాగ చూసుకుంటారనే ఆశెతో మా నాయన సంపాయిచ్చిన రొండెకరాల బూమిని అందరమూ కలిసి ఆ పాపకు సంతోసంగా రాయిస్తిమి. పుట్టింటోల్ల ఆడబిడ్డకు పసుపుకుంకానికని ఇచ్చిన బూమిని ఆ లేకి నా కొడుకు అమ్మడానికి పూనుకుండాడంటే వాడూ వొగ మొగోడేనా? ఈల్ల సదువూ సంస్కారమూ ఆడదాన్నుంచీ వొచ్చే ఆస్తి



పాస్తుల కోసరం అంగలార్చడానికేనా?

పరాయోడు కాబట్టి ఆ పిల్లోడు బుద్ధి లేని పని చేసినాడంటే అర్థముండాది. సొంతం మా పెదనాయన కొడుకులే ఇంత అన్నాయానికి వొడిగడితే ఇంగెవుర్ని నిందించల్ల? సదువుకున్నోల్లు చేసే పనులేనా ఇవి? వాల్లకు మా నాయన సాయం చెయికుండా ఉంటే ఇప్పుడిట్ల జరిగేదా?

మా నాయన పేరు నారాయనప్ప. ఎప్పుడో తన పిల్లప్పుడు ఇంట్లో నుంచీ పారిపోయి మిల్ట్రీలో చేరి వొగ పదేండ్లు పనిజేసి, రొంత లెక్క చేతిలో పెట్టుకొని ఇంటికి తిరిగొచ్చి పెండ్లి చేసుకుండాడంట! అంతకు ముందే వాల్లన్నయ్య, అంటే మా పెదనాయన ఇద్దరు కొడుకుల తండ్రై పాము కరిసి సచ్చిపోయినాడంట! అప్పటికి మా నాయనకు మేమెవురూ పుట్టనే లేదంట! తండ్రిలేని పిల్లలిద్దర్నీ మా నాయనే చేరదీసి ఎనిమిదో క్లాసువరకూ సదివిచ్చి, శానా కస్టపడి ఆ ఇద్దరికీ బిల్ల జవాను పని ఇప్పిచ్చినాడు. వాల్లిద్దురూ గవర్మెంటు నౌకరీలో చేరే నాటికి నేనింగా పిల్లోన్ని. అదేమి గ్రాచారమో యేమో మా తండ్రికి పుట్టిన మాకెవురికీ సదువు అబ్బలేదు గానీ, మా ఇంటి పంచన చేరినోల్లకు సదువబ్బడం, గవర్మెంటు ఉద్యోగాలు రావడం వాల్ల అదురుస్టమనుకోవల్ల. ఈ పొద్దు మాకు అన్నాయం చెయిడానికే వాల్లకు మా నాయన సదువు చెప్పించినాడేమో అనిపిస్తాది.

మిల్ట్రీ నుంచీ తిరిగొచ్చినంక మా నాయన్ని అందురూ సిపాయి నారాయనప్ప అని పిలిచేవాల్లు. కడాకు మా నాయనకు అదే పేరే గవర్మెంటు రికార్డుకెక్కింది. మిల్ట్రీకి పోయిరావడం వల్ల మా

> పరాయి పిల్లోడు బుద్ధి లేని పని చేసినాడంటే అర్థముండాది. సొంతం పెదనాయన కొడుకులే ఇంత అన్నాయానికి వొడిగడితే ఇంగెవుర్ని నిందించల్ల? సదువుకున్నోల్లు చేసే పనులేనా ఇవి?

నాయనకు మా ఊరి పక్కనే గవర్మెంటు రొండెకరాల మడి పట్టా చేయిచ్చింది. అప్పట్నుంచీ ఆ మడికి సిపాయి 'నారాయనప్ప సవుటి కయ్యలు' అని పేరు బడింది. రెడ్డీ కర్నాల దగ్గిరుండే బుక్కుల్లో గూడా అదే మాదిరి రాసుకుండారు. ఈ పొద్దు మా ఊర్లేకి పోయి ఎవుర్నడిగినా ఆ బూమిని సిపాయి నారాయనప్ప సవుటి కయ్యలు అనే అంటారు.

మా పిల్లప్పుడు వర్సాల బాగనే పడేవి. మా పొలమంతా 'సవుటికట్టు' కావడంతో సరిగా పంట పండేది కాదు. అయినా, మా నాయన ఆ పొలమంటే పడి సచ్చేవాడు. కడాకు మా నాయనంతే మేమూ తయారయినాం. అందరమూ కలిసి యేడెనిమిదేండ్లు కస్టపడి సవుటి నేల నిండా ఎర్రగరుసు నింపుకొని బాగా అదును చేసుకొని మంచి పంటలు పండిచ్చుకోసాగినాం.

మడికయ్యలన్నీ వొగ రూపానికి వొచ్చేటప్పటికి మా నాయన కాలం తీరి పోయినాడు. ఆ తర్వాత వర్సాలు కూడా తగ్గిపోయినాయి. మంచోల్లందురూ యెల్లిపోయినట్లే మంచికాలం గూడా యెల్లిపోయిందేమో మరి! వర్సాలు పడక చెరువు నిండకపోవడంతో బీడు బడిన మడికయ్యల్లో సర్కారు తుమ్మచెట్లు పెరిగి పెద్దవయినాయి. అదిగో సరిగ్గా ఆ దినాల్లోనే నేను ఇంజినీరింగు కాలేజీ దగ్గిర నాయర్ క్యాంటీన్లో వంట పని చేసేకి చేరుకుండాను. అట్ల చేరుకోవడం వల్ల నస్టపోయినానో, లాబపడినానో నాకు తెలీదుగానీ ఆ క్యాంటీన్లో చేరినంకనే నాకు లోకమంటే ఎట్లాదో తెలిసింది. పదిమందిలో యెట్ల నడునుకోవల్లో తెలిసింది.

నేను నాయర్ క్యాంటీన్లో చేరే వరకూ మా మడికయ్యలకు మేమే పన్ను కడతా ఉంటిమి. మా నాయన బతికున్నెంతవరకూ మా పెదనాయన కొడుకులు ఇద్దురూ మా ఇంటికి వొస్తా పోతా ఉండ్రి. అట్లా వాల్లు ఈ పొద్దు ఇంతన్నాయానికి వొడిగడతారని యెవురనుకుండారు?

మా మడికయ్యల్లో కంపచెట్లు పెరిగి పెద్దవి కావడంతో మేమెవురమూ ఆ బూమిని గురించి పట్టిచ్చుకోలేదు. ఇదే నందనుకొని సిగ్గూ శెరమూ లేకుండా మా పెద నాయన కొడుకులు సదువుతో వొచ్చిన తమ తెలివినంతా కర్చుబెట్టి వీయేవోకు లంచమిచ్చి 'సిపాయి నారాయనప్ప కొడుకులం మేమే' అని దొంగ రాతలు రాయిచ్చి, యమ్మార్వోను పట్టుకొని అతగానికీ దుడ్లు పడేసి, కడాకు పట్టాపాసుబుక్కులు తమ పేరుమింద తెచ్చుకుండారంట! వొగరికి పుట్టి ఇంగొగరి పేరు చెప్పుకోడానికి సదువుకున్నోల్లకే చెల్లింది కానీ, మా యట్లావాల్లకు మనుసొప్పుతాదా? ఈల్లకు సిగ్గులేకపోతేమానె, పట్టాపాసుబుక్కులు ఇచ్చేవాల్లకయినా సిగ్గుండొద్దా? సదువు వల్ల బుద్ధి సంపాదిచ్చుకొని, ఆ సదువును

గబ్బు పట్టిచ్చడమే సదువుకున్నోల్ల లక్షనమా?

మా పెద నాయన కొడుకులు చేసిండే ముదనష్టపు పని తెలిసి ఊర్లో ఉండే పాతకాలం మనుసులందురూ కటకటపడినారు. సదువుకున్నోల్లంతా యెక్కువయి ఊరు సెడిపొయ్యిందని బాదపడినారు. సదువువల్ల మనిసి తనలో ఉండే అగ్నానాన్ని పోగొట్టుకొని జనానికి ఉపయోగపడల్లగానీ మోసం చేస్తే సదువుకున్నోల్ల మింద గవరవం పోతుందని వెతపడినారు.

ఇంత జరిగినంక ఆ పొలాన్ని వొదులుకుండేకి అయితాదా? ఇప్పుడు మా మడికయ్యలకు రొండు పర్లాంగుల దూరంలో ఏందో ఫ్యాక్టరీ కడతారంట. దాంతో ఆ సుట్టుపక్కలుండే బూములన్నీ అప్పుడే రేట్లు పెరిగినాయి. అట్లా బూమి ఈ పొద్దు మాకు చెందకపోవచ్చుగానీ దాన్ని వొదులుకుండేకి మను సొప్పుతాదా? అందికే మా యెంగటేసు బావతో జరిగిందంతా చెప్పి కోర్టో కేసు పెడదామన్నాను. ఆయన శానా దూరం ఆలోసెన చేసే మనిషి. రోంతసేపు పెదువులు రెండూ నోట్లేకి ముడుసుకొని, కండ్లు మూసుకొని ఆలోసెన చేసి పది నిమిశాలయినంక పెదువులిప్పినాడు.

'సూరన్నా, మీ అన్నదమ్ముల కొడుకులందురూ కలిసి ఇరవై నాలుగు మంది ఉండారు. మీ నాయన సంపాదిచ్చిన ఆ రొండెకరాల బూమినీ మీరు పంచుకోనుంటే తలా పది సెంట్లు గూడా వొచ్చేది కాదు. అందురూ కలిసి శానా తెలివిగానే ఆ బూమిని ఆడపిల్లకు పసుపుకుంకుమకు రాసిచ్చినారు. ఈ తెలివే అంతకు ముందుంటే ఈ పొద్దు ఆ బూమి తమదని మీ దాయాదులు పట్టా పాసు బుక్కులు తెచ్చుకోనుండేవాల్లా? ఇప్పుడు అందురూ కస్టం చేసుకొని సుకంగా బతుకుతా ఉండారు. అట్లా వాల్లు పనులొదిలేసి కోర్టుకు తిరిగితే సివిలు కేసులు వొగతాయంగ తెగుతాయా? అందికే కోర్టుకు పోయినోడూ కాశీకి పోయినోడూ వొగటేనని పెద్దోల్లు అనిండేది. చేసే పనులొదిలేస్తే నస్టపొయ్యేది మీరే గదా! ఆ నస్టమేదో లెక్కేసి, నిజంగానే నస్టపోయినా మనుకొని అదంతా కలిపి ఆ పాప పసుపుకుంకానికి టౌన్లో యాడో వొగసోట వొగ ప్లాటు తీసిచ్చేది మేలు కాదా?'

మా ఎంగటేసు బావ ఇట్ల చెప్పడం మీకు బాగుందేమో కానీ నాకు మాత్రం సరిపోలేదు. అన్నాయం జరిగినా కడుపులో దాసుకొని కాలానుగునంగా అన్నీ సర్దుకొని పోవల్ల అనేది మా బావ అబిప్రాయం. బాగా సదువుకొని ఇంగితగ్నానం కలిగిన పెద్దోల్లు గూడా ఇట్ల మాట్లాడితే ఇంగెవురు అన్నాయాన్నీ, అదర్మాన్నీ అడ్డుకుండేది? మనుసులందురూ అడివి మనుసుల మాదిరి ఉండే కాలంలో, ప్రెపంచ గ్నానం ఏందీ తెలీని కాలంలో బలవంతుడు బలం లేనోన్ని దోసుకుండాడంటే అర్తముండాది. ఈ కాలంలోగూడా అదే జరుగుతా ఉంటే యేమని చెప్పల్ల? మనిసి సదువు నేర్చుకొని, బుద్దీగ్నానం సంపాదిచ్చుకొనిండేది ఇట్ల మోసం చెయిడానికేనా? పుట్టగోసెంత సదువు సదువుకొని నమ్మకద్రోహం చేసేకి శాతనయిన ఆ ఇద్దరి తెలివే గొప్పదయితే, జెగజ్జెట్టీల మాదిరుండే నా కొడుకులు ఇరవై నాలుగు మంది చేతులు కలిపిన శెక్తి సన్నదయితాదా?

ఇదే మాట మా ఎంగటేసు బావతో అన్నాను.

'ఆర్నెల్లయింది- వొగ యాక్సిడెంటు లేదు, వొగ దొంగతనం లేదు, వొగ ఖూనీ లేదు. ఇంగ యాడ గిట్టుకుంటాడి సార్!' ఆ మాటలు గుర్తుకురాగానే వొల్లంతా తెల్లా జెర్రెలా పారాడినట్లయింది.



ఆయన రోంతసేపు ఆలోసెన చేసి మెల్లగా వొక ప్లాను చెప్పి ఇంటికెల్లిపోయినాడు. అయితే, మాకు మోసం చేసిన ఆ మూడుగాసులోల్లతో దెబ్బలు తిననట్ల నటించి వాల్లమింద తప్పుడు కేసు పెట్టేకి నా కొడుకులు ఎవురూ వొప్పుకోలేదు. నదువొచ్చి నోల్లకూ, రానోల్లకూ అదేగదా తేడా?

ఆ పొద్దు సంద్యాల అయితావుంది. నా మాట కాదన్న్యాక నా దాయాదులతో వాదులాట పెట్టుకోడానికని పోయి, అక్కను పట్టుకోల్యాక నా కొడుకులు ఐదుమందీ సుట్టుకొని మా పెదనాయన కొడుకు రామన్నను నాలుగు మూగిదెబ్బలేసినారు. అది తెలుస్తానే నేను పరిగెత్తిపోయినాను. అప్పటికే తలకు గాయాలయి రామన్న కిందపడ్నాడు. ఆడోల్ల పక్కన కుచ్చోని నెత్తీనోరూ కొట్టుకుంటా వుండారు.

రామన్న యెట్లావాడయినా నాకు అన్నే కదా! అందికే కింద పడిన ఆ యప్పనూ, యేడుస్తా ఉండే ఆడోల్లనూ చూసి నా ప్రానం రోంతసేపు తనకలాడింది. నా కొడుకులు రామన్న ఇంట్లో ఉండే పట్టా పానుబుక్కులు చించిపారెయ్యల్లని వాల్ల ఇంట్లేకి దూరడానికి పూనుకుండారు. అది చూసి నేను గట్టిగా గదురుకుండాను. సన్నోన్ని మెడమింద రొండు దెబ్బలేసి, ఎనిక్కి నూకినాను. అందురూ నామింద కోప్పడతా, గత్తు చేసుకుంటా ఇంటికెల్లిపోయినారు. వాల్లు అట్ల పోతానే ఆడుండే ఆడోల్లు నన్ను బండ బూతులు తిట్టేకి మొదులుపెట్నారు. అవేమీ పట్టిచ్చుకోకుండా దెబ్బలు తగిలిన రామన్నను ఆసుపత్రికి యేసకపోడానికి చూస్తావుండాను. అంతలోనే రామన్న తమ్ముడు టౌన్నుంచీ వొచ్చి, జరిగిందంతా తెలుసుకొని నామిందికి గొడ్లి ఎత్తుకొని వొచ్చినాడు. అక్కడ సుట్టుకోనుండే జనమంతా అడ్డమొచ్చి నన్ను మా ఇంటికి పంపిచ్చినారు.

చీకటి పడేనరికల్లా మా అన్నదమ్ముల కొడుకులందురూ ఆదరాబాదరా వొచ్చి మా ఇంటికాడ జమయినారు. 'అయ్యేది అయితావుండె, ఆ తప్పుడు నాకొడుకును లేపేసింటే బాగుండేది' అని అందురూ పెదువులిరిసినారు. మా పిల్లనాయాల్లు అదీ ఇదీ మాట్లాడుకుంటా వుండంగనే టౌన్లో కాపురముండే రామన్న కొడుకులూ, ఆయప్ప తమ్ముని కొడుకులూ అందురూ వొచ్చి రామన్నను చూసి పల్లెత్తు మాట మాట్లాడకుండా ఆయప్పను బండ్లో అనంతపురానికి యేనకపోయినారు. వాల్లు అట్ల మవునంగా ఎల్లిపోయినప్పట్నుంచీ నాకు రోంత అనుమానం యెక్కువైంది.

కాడాకు నా అనుమానమే నిజమయింది.

అర్దరాత్రప్పుడు ఎవురో తలుపు తట్టిన శెబ్దమయితానే లేసి తలుపు తీసినాను. ఎదురూగ ఐదుమంది పోలీసోల్లు. అందురూ రాస్తాడు పోలీసోల్లే. వాల్లను చూస్తానే నాకు కంపం పట్టింది. నా పెండ్లాం బిత్తరపొయ్యింది. మేమెంత మొరపెట్టుకున్నా ఇనుకోకుండా నా కొడుకుల్ని ఐదుమందినీ పోలీసోల్లు పట్టకపోయినారు. యానాడేగానీ కాసింత గూడా జంకని నా గుండెకాయ, కొడుకుల్ని పోలీసోల్లు పట్టకపోతానే రోంతసేపు వొనికింది. వొగపక్క మా బసేలి రాగాలు తీస్తా యేడుస్తా ఉంది. దాని యేడుపులకు సుట్టుపక్కలోల్లు తెప్పరిల్లుకొని వొచ్చి సుట్టుకుండారు. అందురూ బాదపడినారు. నా పెండ్లాన్ని సముదాయిచ్చుకుంటా సదువొచ్చిన నా దాయాదుల కొడుకులు తెలివిగా సులకాగ నా కొడుకుల్ని జైలుకు పంపడం తల్సుకొని కుమిలిపోయినాను.

తెల్లారింది. నేను మా ఎంగటేసు బావ కోనరం పరివెత్తినాను. ఆయన అప్పటికే లేసి ఏందో పనిమింద నార్పలకు పోయినాడని తెలిసి దిక్కు తెలీక తనకలాడినాను. అన్నీ మనం అనుకున్నెట్ల



జరగవు గదా అనుకొని మద్యాన్నం వరకూ కాల్లు గాలిన పిల్లి మాదిరి అక్కడా ఇక్కడా తిరిగినాను. మా బావ మద్యాన్నానికి వొచ్చినాడు. వొచ్చీరాగానే నిన్న జరిగిండేదంతా చెప్పి బాదపడినాను. ఆయన యెంటనే నన్ను మోటర్ సైకిల్ మింద ఎక్కిచ్చుకొని ఎస్.పి ఆపీసు దగ్గిరికి పిలుసుకొనిపోయినాడు. ఆడ ఆపీసులో ఇద్దురు ముగ్గురు మా బావను చూస్తానే లేసి నమస్కారం చేసినారు. వొగ యస్సై మిల్ట్రీ వాని మాదిరి సెల్యూటుగొట్టి మా ఇద్దరికీ కాపీ తెప్పిచ్చినాడు. అది చూసి నా మనసు వుబ్బిపొయ్యింది. మొగం చాటడం తయింది. పోలీసు డిపార్టుమెంటులో మా బావకు తెలిసినోల్లను ఇంతమందిని పెట్టుకోని ఇంగ యాల బయపడల్లని అనుకుండాను. మా బావ వొగ ఆపీనర్ని పక్కకు పిలిచి ఇంగిలీసులో యేందో మాట్లాడినాడు. ఆ ఆపీసరు లోపలికి పోయి పోన్లో ఎవురితోనో మాట్లాడి బయటికొచ్చి సాయింత్రం నాలుగ్గంటలకు రాప్తాడుకు పోదామన్నాడు. మా బావ సరేనన్నాడు. వాల్ల మాటల్ని బట్టి మా బావ జతగాని పేరు రామాంజి నేయులని అర్తమయింది. మా బావ నా దగ్గిరికొచ్చి సాయింత్రానికి రొండువేలు లెక్క సర్దుకొని రమ్మన్నాడు. నేను బీకరానికి ఊకొట్టి పల్లెకు ఎల్లిపోయినాను.

మా బావా, ఆయన జతగాడు రామాంజినేయులూ, నేనూ సాయింత్రం రాప్తాడు పోలీస్టేషన్ చేరుకుండాం. అది ఐదరాబాద్ నుండీ బెంగులూరుకు పొయ్యే రోడ్డు పక్కనే ఉంది. మమ్మల్ని బయటనే ఉండమని చెప్పి రామాంజినేయులు సారు స్టేషన్ లోపలికి పోయినాడు. మేము రోడ్డు పక్కనే చింత చెట్టు కింద నిలబడుకుండాం. మమ్మల్ని చూసి ఆ పక్కనే ఉండే టీ బంకులో నుంచీ వొగ కానిస్టేబులు బిరబిరా వొచ్చి మా బావకు నమస్కారం చేసి 'నన్ను గుర్తు పట్టలేదా సార్, నేను మీ స్టూడెంటును' అని తన పేరు చెప్పినాడు. నాకు సంతోషమయింది.

కానిస్టేబులు, మేము ఆటికి పోయినదానికి కారనమడిగినాడు. మా బావ అంతా చెప్పినాడు.

'అయ్యో, అట్లనేం సార్! వాల్లు మీ వాల్లేనా సార్? వాల్లను అరెస్ట్ చేసేకి నేను గూడా పోయినాను. పాపం, అమాయకుల మాదిరి వుండారు సార్. అవతలి పార్టీ వాల్లతో మా యస్సై ఐదువేలు తిని ఈల్లను అరెస్టు చేసేకి మమ్మల్ని పంపినాడు సార్. తప్పుడు నా కొడుకు మాకొగ పైసా గూడా ఇవ్వకుండా అంతా తన జోబీలోనే యేసుకుండాడు' అంటా ఆ కానిస్టేబుల్ రొంత గొంతు తగ్గిచ్చినాడు.

అతని మాటలు ఇంటానే నాకు యాపకాయి కొరికినట్లయింది. 'ఇతగానికి ఆ యస్సై అంతో ఇంతో పడేసింటే ఇప్పుడిట్ల మాట్లాడేవాడా?' అని నాలో నేను గొనుక్కుండాను.

స్టేషన్లో నుంచి కానిస్టేబుల్ వొకాయనొచ్చి మమ్మల్ని పిలుస్తానే మేమిద్దరమూ లోపలికి పోయినాం. రామాంజినేయులు సారు మా బావను యస్సైకి పరిచయం చేసినాడు. నేను యస్సైకి నమస్కారం చేసి వొగ పక్క నిల్చుకొని ఆయన కల్లే చూస్తావుండాను. మనిసి బొగు సొగుసుగా వుండాడు. ఇంగా పిల్ల నాయాలు. మీసం కట్టు గూడా సరిగ్గా యేర్పడలేదు.

మా బావ మా కతంతా యస్సైకి పూస గుచ్చినట్ల చెప్పినాడు. అంతా ఇని, 'మీరే వాల్లకంటే ముందుగా వొంటి మింద గాయాలు చేసుకొని వొచ్చి కేసు పెట్టింటే వాల్లకు తగిన శాస్తి చేసేవాన్ని గదా!' అంటా ప్రేమ వొలకబోసినాడు. ఆ మాటలు ఇంటా మా బావ నా పక్క జూసినాడు. ఆ సూపులు నాకు అర్తమయినాయి. రామాంజినేయులు సారు మద్దెలో కలగజేసుకొని అవీ ఇవీ మాట్లాడి నా దగ్గిరుండే రొండువేలు ఇప్పించుకొని యస్సై చేతిలో పెట్టినాడు.

కేసు రాయకుండా ఐదుమంది ముద్దాయిల్ని ఇడిసిపెట్టేకి ఐదువేలన్నా ఇప్పించకపోతే యెట్ల సార్? ప్రతినెలా మీ ఆపీసోల్లకే పదివేలు ఇయ్యల్ల. ఈడ పది మంది కానిస్టేబుల్లుండారు. వాల్లకూ తలాకింత పంచిపెట్టల్లగదా!' అంటా గొనిగినాడు యస్సై.

మేడిపండు మాదిరి పైకి సొగుసుగా కనిపిస్తా మనసులో గబ్బంతా నింపుకోనుండే అతన్ని చూస్తానే నాకు వాంతికి వొచ్చినట్లయింది.

పోలీసోల్ల కతలు మా బావకు బాగా తెలును నేమో, తాను గూడా దుడ్లు తెచ్చినట్లుంది. ట్రౌజర్ జోబీలో నుంచీ మూడువేలు తీసి జతగాని చేతికిచ్చినాడు. ఆయన యస్సై చేతిలో పెట్టినాడు. యామాత్రమూ సిగ్గూ యెగ్గూ ల్యాకుండా యస్సై దుడ్లు తీసుకుండాడు. చూస్తావుండే నాకు బాదయింది.

దుడ్లు చేతిలో పడతానే యస్సై టీ కోసరం కానిస్టేబుల్ని పంపినాడు. అప్పుడాయన మాటలు నాకు బోగం దాన్ని గుర్తుకు తెచ్చినాయి. రామాంజినేయులు సారు యస్సైతో అదీ ఇదీ మాట్లాడతా, 'అంతా సరే రంగారావ్, ఈ స్టేషనుకు వొచ్చినందుకు బాగనే గిట్టుకుంటా వుందా' అని అడిగినాడు. ఆ మాటలకు జవాబు చెప్పల్లని యస్సై యెన్నాల్ల నుంచీ అనుకుంటా ఉండాడో యేమో గానీ మనసులో ఉండేది దాసుకోకుండా చెప్పినాడు.

కల్లాకపటం తెలీని జింకపిల్ల మాదిరుండే ఆ యస్సై నోట్లో నుంచీ తోడేలు అరుపుల మాదిరి బయిటికొచ్చిన మాటలు ఇంటానే అక్కడ నిలుసుకుండేకి నా శాత కాలేదు. తలకాయొంచుకొని వరండాలేకి వొచ్చి గోడకు ఆనుకొని రోడ్డు పక్క చూస్తా ఆలోసెన చేస్తా ఉండాను. అంతలోనే వొగ కానిస్టేబులు లోపల్నుంచీ నా కొడుకులందరినీ బయిటికి పిలుసుకోనొచ్చినాడు. వాల్లను చూస్తానే నా కనుగుడ్ల మింద నీల్లు పారాడినాయి.

అందరమూ బయిల్దేరి చేరుకుండాం. మా బావ రామాంజినేయులు సార్ని మోటార్ సైకిల్ మింద యెక్కిచ్చుకొని ఇంటికి పోతా, 'వాల్లకిచ్చిన పట్టా పాసుబుక్కులు క్యాన్సిల్ చేయిచ్చల్లంటే మనం వకీల్ని పెట్టుకొని ఆర్డీవోకు అపీలు చెయ్యల్ల' అని చెప్పి యెల్లిపోయినాడు.

నేనేమీ మాట్లాడలేదు. కొడుకుల యెనకాల అడ్డదావ గుండా మా పల్లెకు బయిల్దేరి మవునంగా నడుస్తా వుండాను. నా చెవుల్లో పలుకురాయి ఉండేమో, రామాంజినేయులు సారు స్టేషన్లో అడిగిన దానికి యస్సై చెప్పిన మాటలు మల్లా మల్లా ఇనిపించినాయి.

'యేం లాబం లేదు సార్. అంతా బీడు. మా పోలీస్ టేషన్ ఐవే (హైవే) మింద ఉందని సంతోసపడల్సిందే గానీ, ఆర్నెల్లయింది వొగ యాక్సిడెంటు లేదు, వొగ దొంగతనం లేదు, వొగ ఖూనీ లేదు. ఇంగ యాడ గిట్టుకుంటాది సార్?'

ఆ మాటలు గుర్తుకు రాగానే నా వొల్లంతా తేల్లూ జెర్రెలూ పారాడినట్లయింది. తాను గడ్డి తినేకి వొగ యస్సై ఇట్ల కోరుకుంటే ఇంగ రేపొద్దున మా బావ మాట పకారం ఆర్డీవో దగ్గిరికి పోతే ఆయనేమి కోరుకుంటాడో?

ఆ ఆలోసెన మనుసులో మెదులుతానే నా వొంట్లో ఉండే సత్తువ మెల్లిగా కరిగిపోతా వున్నెట్ల అనిపించింది. ఈ దేశమూ, ఈ గవర్మెంట్లూ, ఈ ఆపీసర్లూ, ఈల్ల సదువులూ యెవురికోసరముండాయని నా మనసు నన్నే అడగసాగింది. దీనికి జవాబు సదువుకున్నోల్లు మీరు చెప్పగలరేమోగానీ సదువు రానోన్ని నేనేమి చెప్పగల్ను? ■